# విశాల భారతి

26-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ | సంపుటి:3 సంచిక: 356


## మెదక్ చర్చికి పోటెత్తిన భక్తులు

- మెదక్ కేథడ్రాల్ చర్చిలో క్రిస్మస్ వేడులకు వైభవంగా జరిగాయి
- ఆరాధన కార్యక్రమం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైంది
- క్రిస్మస్ సందర్భంగా చర్చిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు
- ప్రభుత్వం రూ. 29 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు చేసింది
- ఆరాధకులు అత్యంత భక్తి శ్రద్ధలతో క్రీస్తును ఆరాధించారు
- ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

03



## మావోయిస్టు అగ్రనేత గణేశ్ హతం

ఒడిశాలోని కందమాల్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

మావోయిస్టు కీలక నేత గణేశ్ ఉయికే హతమయ్యాడు

అతడితోపాటు మరో ఐదుగురు మావోలు మరణించారు

ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పోస్ట్ చేశారు

నక్సల్ రహిత దిశగా ఒక మైలురాయిగా వర్ణించారు

నక్సలిజాన్ని నిర్మూలించడానికి కట్టుబడి ఉన్నాం అన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఒడిశాలోని కందమాల్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే హతమయ్యాడు. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో అతడితోపాటు మరో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. అందులో మహిళలు కూడా ఉన్నారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పోస్ట్ చేశారు. ఒడిశా ఎన్‌కౌంటర్‌ను నక్సల్ రహిత భారతదేశం

**మిగతా 2లో..**



# కేసీఆర్ దొరికినట్లే?

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారని ప్రచారం

అయితే ఎలా ఇస్తారని హరీష్ రావు ఎదురుదాడి చేస్తున్నారు

కేసీఆర్ చేసిన ఓ తప్పిదం వల్ల చిక్కులు పడబోతున్నాడు

అందుకు ఫామ్ హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారమే కారణం

కేసీఆర్ ఆడియో, కీలకమైన డాక్యుమెంట్లను విడుదల చేశారు

అవి ఎక్కడి నుంచి వచ్చాయన్నది ఆరా తీసే అవకాశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


ఫోన్ ట్యాపింగ్ కేసులో సజ్జనార్ నేతృత్వంలోని సిట్ చాలా వేగంగా స్పందిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు ఒక కీలకమైన మలుపు తిరిగింది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ వ్యవహారం, ఇప్పుడు రాష్ట్రంలోని అత్యున్నత రాజకీయ నాయకత్వం చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. ప్రత్యేక దర్యాప్తు బృందం చేపడుతున్న చర్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ కేసులో తాజా పరిణామాలు, కొత్త సాక్ష్యాలు, రాబోయే రోజుల్లో జరగబోయే రాజకీయ పరిణామాలు అనేక మార్పులు తీసుకురానున్నాయి. ఈ కేసులో అత్యంత కీలకమైన పరిణామం ఏమిటంటే, డెక్కన్ కిచెన్ యజమాని నందకుమార్ తాజాగా సిట్ విచారణకు హాజరుకావడం. గతంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నందకుమార్ పేరు ప్రముఖంగా వినిపించింది, ఆ సమయంలో ఆయన అరెస్ట్ కూడా అయ్యారు. అయితే, ప్రస్తుత విచారణ కేవలం పాత కేసుల గురించి మాత్రమే కాదు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఫోన్ ట్యాపింగ్ అంశంపై సాగుతోంది. నందకుమార్ గతంలోనే ఒక సంచలన ఆరోపణ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాపింగ్ చేసిందని, దీనికి సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఆయన గట్టిగా వాదించారు. తాను ఎక్కడ ఉన్నాను, ఎవరితో మాట్లాడుతున్నాను అనే వివరాలను అప్పట్లో తన ప్రమేయం లేకుండా తీసుకున్నారని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను, ఆధారాలను తాను అప్పటి డీజీపీకి కూడా అందజేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ చేపట్టారు. దీంతో ఆయన్ని ఇప్పుడు సిట్ అధికారులు విచారణకు పిలిచారు. నాడు ఏం జరిగింది, ఆయన వద్ద ఉన్న సమాచారం ఏంటనే కోణంలోనే సుదీర్ఘంగా అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. ఈ కేసులో బాధ్యులైన వారిని, వారు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని నందకుమార్ డిమాండ్ చేస్తున్నారు.

కేవలం కింది స్థాయి అధికారులనో లేదా మధ్యవర్తులనో ప్రశ్నిస్తే ఈ కేసు కొలిక్కి రాదని దర్యాప్తు సంస్థ భావిస్తోంది. అందుకే, ఈ కేసును ఒక లాజికల్ కంక్లూజన్‌కు తీసుకురావాలంటే, అప్పటి ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల ప్రమేయంపై స్పష్టత రావాలని సిట్ నిర్ణయించింది. ఈ క్రమంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలని సిట్ అధికారులు

**మిగతా 2లో..**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఎలా ఇస్తారని హరీష్ రావు ఎదురుదాడి చేస్తున్నారు కానీ.. కేసీఆర్ చేసిన ఓ తప్పిదం వల్ల ఆయనకు చిక్కులు వచ్చి పడబోతున్నాయని చెబుతున్నారు. ఫామ్ హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసు వ్యవహారం బయటపడినప్పుడు కేసీఆర్ నందకుమార్, స్వామిజీలు మాట్లాడిన ఆడియోలతో పాటు పలు కీలకమైన డాక్యుమెంట్లను అప్పటి సీఎం కేసీఆర్ విడుదల చేశారు. వాటిని సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు పంపించారు. అవి ఎక్కడి నుంచి వచ్చాయన్నది ఆరా తీయడానికి ఆయనకు నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.**

## చిల్లర మాటలు మానుకో రేవంత్



- సిద్దిపేటలోని క్రిస్మస్ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు
- ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు
- రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మానుకోవాలని అన్నారు
- పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు
- అనాథ పిల్లలకు అన్నం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు
- రేవంత్‌రెడ్డి మళ్లీ గెలుస్తానని శపథాలు చేస్తున్నారని విమర్శించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** క్రైస్తవుల సంక్షేమానికి గత కేసీఆర్ సర్కార్ ఎంతగానో కృషి చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో క్రిస్మస్ సందర్భంగా రెండు రోజుల పాటు సెలవులు ఇచ్చామని ప్రస్తావించారు. కూసీఆర్ అన్ని మతాలను గౌరవించారని పేర్కొన్నారు. క్రిస్మస్ కిట్టు, బతుకమ్మ చీరలు, రంజాన్‌తోపాటు తమ ప్రభుత్వంలో అందించామని తెలిపారు. కానీ తమ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మాత్రం క్రిస్మస్ కిట్టు ఎందుకు అందించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గురువారం సిద్దిపేట

**మిగతా 2లో..**

## తెలంగాణ నంబర్ వన్ ద్రోహి కేసీఆర్

- మీడియా చిట్‌చాట్‌లో బండి సంజయ్ పాల్గొన్నారు
- ఈ సందర్భంగా కేసీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు
- కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు
- కాళేశ్వరం ప్రాజెక్టు దృష్టి మళ్లించే యత్నం చేస్తున్నారు
- కేసీఆర్‌పై సీఎం రేవంత్ మాట్లాడిన భాష సరికాదన్నారు
- వైఎస్ జగన్, కేసీఆర్ మధ్య ఏం ఒప్పందం జరిగిందో చెప్పాలి



విశాలభారతి, స్టేట్ బ్యూరో: కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాల అంశం కేసీఆర్ లేవనెత్తుతున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించా అని చెప్పారు.

**మిగతా 2లో..**



## బంగ్లాలో ఆగని మారణకాండ

- బంగ్లాదేశ్‌లో అల్లరీ మూకల అరాచకం తారాస్థాయికి చేరింది
- హిందువులనే టార్గెట్‌గా దాడులు చేస్తున్నారు


03

## అలా గెలిచారు.. ఇలా సమస్యలపై దృష్టి సారించారు



**కేశంపేట, విశాలభారతి:** గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్ లు, వార్డు సభ్యులు అప్పుడే గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి అడుగులు ముందుకు వేస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరగడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామ సర్పంచ్ గ్రామంలోని ఒకటో వార్డులో నీటి సరఫరాకు గేటు వాళ్ళ సమస్య ఏర్పడడంతో నూతన గేట్ వాళ్లను బిగించారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్ నుండి నీరు ఓవర్ ఫ్లో కాకుండా చర్యలు తీసుకున్నారు. కోనాయపల్లి గ్రామ సర్పంచ్ ధనలక్ష్మిరామకృష్ణ గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్ళి నీటి నమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా కాకునూరు గ్రామంలోని ఏడవ వార్డులో నీటి పైప్ లైన్ లీకేజి ఏర్పడడంతో నూతన పైప్ తెప్పించి గ్రామ సర్పంచ్ బుడ్డోల్ల రాజు,వార్డు సభ్యుడు సీమల శ్రీనివాస్ లు సమస్య పరిష్కారానికి నడుం బిగించారు.

## కే4 మిసైల్ ప్రయోగం సక్సెస్



- భారత నేవీ కే-4 బాలిస్టిక్ మిసైల్‌ను విజయవంతంగా ప్రయోగించింది
- ఈ క్షిపణి 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు
- అంతేకాకుండా రెండు టన్నుల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు
- భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన ఘట్టంగానిలవనుంది
- ఇది దేశ న్యూక్లియర్ ట్రయాడ్‌ను మరింత బలోపేతం చేస్తుంది
- సముద్రం జలాల నుంచి ప్రయోగానికి వీలుగా అభివృద్ధి చేశారు

02



## సేవ్ ఆరావళి

ఆరావళి పర్వతాలు ప్రపంచంలోని అత్యంత పురాతన పర్వత శ్రేణులు

అయితే పర్వతాల్లో జరిగే మైనింగ్‌ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు

దీంతో మైనింగ్ నిషేధంవిధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

కానీ ఇది పైకి కనిపించే నిర్ణయమనే వాదనలు వినిపిస్తున్నాయి

రావళి పర్వతాల్లో 90 శాతం పర్వతాలు కాదని ఉత్తర్వులు జారీ చేసింది

ఆరావళి పర్వత శ్రేణులకు దాదాపు 200 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉంది

ఇవి థార్ ఎడారి విస్తరించకుండా అడ్డుకునే రక్షణ కవచంలా పనిచేస్తాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రపంచంలోని అత్యంత పురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళి పర్వతాల సంరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న ఈ పర్వత శ్రేణిలో కొత్త మైనింగ్ లీజులపై పూర్తి నిషేధంవిధిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇది పైకి కనిపించే నిర్ణయం. అంతర్గతంగా గతంలో ఓ నిర్ణయం తీసుకుంది. అదేమిటంటే ఆరావళి పర్వతాల్లో 90 శాతం పర్వతాలు కాదని ఉత్తర్వులు జారీ చేయడం. కారణం ఆరావళి పర్వతాలకు సంబంధించి కేంద్రం ప్రతిపాదించిన కొత్త నిర్వచనం అందర్నీ విస్మయానికి గురి చేస్తోంది. కేంద్రం ఉత్తర్వు ప్రకారం.. స్థానిక భూమట్టం నుంచి 100 మీటర్లు అంటే సుమారు 328 అడుగులు అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న వాటిని మాత్రమే ఆరావళి పర్వతాలుగా పరిగణిస్తామని ప్రకటించింది.

**మిగతా 3లో..**

# చిల్లర మాటలు మానుకో రేవంత్

( మొదటి పేజీ తరువాయి )

పట్టణంలోని సీఎస్ఐ చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు హరీశ్‌రావు. ఈ సందర్భంగా అందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా క్రిస్మస్ వేడుకల్లో ఇక్కడ పాల్గొంటున్నానని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది క్రిస్టియన్లు క్రిస్మస్ పండగను చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఏసుప్రభువు ఎంతో మంచి సందేశాన్ని ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు హరీశ్‌రావు. అలాగే.. పట్టణంలోని నాసార్‌పుర అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. విద్యార్థులకు పెట్టే గుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు హరీశ్‌రావు. గత ప్రభుత్వంలో పాత బియ్యం ఇచ్చామని తెలిపారు. ఇప్పుడు కొత్త బియ్యం ఇస్తున్నారని.. అన్నం మెత్తగా ముద్దలుగా అవుతుందని చెప్పుకొచ్చారు. పిల్లలు చలితో చాలా ఇబ్బందులు పడుతున్నారని.. దుప్పట్లు



పంపిణీ చేశామని అన్నారు. ఐదు నెలల నుంచి విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు రావడం లేదని తెలిపారు. మెస్ బిల్లులు ఐదు నెలల నుంచి ఎందుకు రావడం లేదని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రీన్ చానెల్ ద్వారా డబ్బులు ఇస్తామని చెప్పారని.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. 20శాతం కమీషన్ ఇచ్చే వాళ్లకు డబ్బులు విడుదల చేస్తున్నారని, కమీషన్ ఇవ్వని వాటికి డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు హరీశ్‌రావు. రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాని పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి దగ్గరే విద్యాశాఖ ఉండి కూడా అనాథ పిల్లలకు అన్నం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మళ్లీ గెలుస్తానని శపథాలు చేస్తున్నారని విమర్శించారు. కమీషన్లు కొట్టుడు చిల్లర మాటలు మాట్లాడటం.. పార్టీలు మారడం, సీట్లు కొనడం మాత్రమే రేవంత్‌రెడ్డికి అలవాటని సెటైర్లు గుప్పించారు. తెలంగాణ తెచ్చిన పోరాట యోధుడు కేసీఆర్ అని ప్రశంసించారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదని చెప్పుకొచ్చారు. తండ్రి లాంటి కేసీఆర్ గురించి అలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఫార్మసిటీనీ తాము ఏర్పాటు చేస్తే దానిని ఆయన ఖండించారని, ఇప్పుడేమో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శలు చేశారు. వీధి రౌడీలాగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. 24 గంటల కరెంట్ రావటం లేదని రైతులు మొర పెట్టుకోవంతో రెడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ను మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. పార్టీ సమావేశానికి వెళ్తుండగా రైతులు కరెంట్ రావడం లేదని ఫోన్ చేస్తే స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని అడిగి విద్యుత్ సరఫరా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవంత్ ప్రభుత్వం రైతులకు కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నట్టుగా ఉంది. రేవంత్ రెడ్డి రైతులకు 24 గంటలు కాకుండా కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నాడని మండిపడ్డారు. 'రెడ్డిపల్లి, మద్దూరు గ్రామ రైతులు ఫోన్ చేసి కరెంటు సరిగ్గా రావడం లేదని ఫోన్ చేస్తే మేము ఇక్కడికి సబ్ స్టేషన్ దగ్గర ఆగి పరిశీలించాం. రేవంత్ రెడ్డి 24 గంటలు కరెంటు ఇస్తమంటున్నాడు. రెడ్డిపల్లి, మద్దూరు గ్రామాల ప్రజలు 12 13 గంటలకు కరెంటు మాత్రమే వస్తోందని.. తమకు ఇబ్బంది అవుతుంది రైతులు వాపోతున్నారు. పొలానికి నారేసే టైం ఇబ్బంది అవుతుందని ఫోన్ చేస్తే ఇది నిజమా కాదా? అని సమస్య ఏంది అని తెలుసుకుందామని నర్సాపూర్ సబ్ స్టేషన్‌కు వచ్చాం' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి బాటలు వేయండి




- తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుంది
- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ

కేశంపేట, విశాలభారతి: నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని, గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ అన్నారు.గురువారం కేశంపేట గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం మహబూబ్ నగర్ లో బిజెపి పార్టీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణమ్మను మర్యాద పూర్వకంగా కలిసారు.సందర్భంగా ఎంపీ గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోషశ్రీశైలంను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో గ్రామాలను అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయనిస్తుందని, గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, వార్డు సభ్యులు పోలెమోని సతీష్, మంచె కృష్ణయ్య, తిమ్మగళ్ల చంద్రకళరామచంద్రి, గంజాయి దశరథం, కమ్లికర్ అనితనాగేష్, లిక్కి హంసమ్మ విజయ్,బిజెపి నాయకుడు తలసాని పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దొరికినట్లే?







( మొదటి పేజీ తరువాయి )


నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకాకుండా, మాజీ మంత్రి హరీశ్‌రావును కూడా విచారించే యోచనలో సిట్ ఉంది. ఒక రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చినప్పుడు, దానికి బాధ్యులైన అధికారులకు ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయనేది అత్యంత కీలకం. ఈ ప్రశ్నలకు సమాధానం లభించాలంటే అప్పటి నిర్ణయాధికారులను ప్రశ్నించక తప్పదని దర్యాప్తు బృందం భావిస్తోంది. అయితే, ప్రస్తుత శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాతే ఈ సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. దీనివల్ల రాజకీయంగా ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా జాగ్రత్త పడుతున్నట్లు కనిపిస్తోంది.ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల వ్యక్తిగత సంభాషణలను ట్యాపింగ్ చేయడం అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమే. నందకుమార్ వంటి వ్యక్తులు చేస్తున్న ఆరోపణలతో గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసు చుట్టూ తిరిగిన రాజకీయాలు, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసుతో మళ్ళీ మొదటికి వచ్చాయి. సిట్ అధికారుల ముందు నందకుమార్ హాజరుకావడం, ఆయన వద్ద ఉన్న ఆధారాలు సమర్పించడం ఈ కేసులో గేమ్ ఛేంజింగ్ వ్యవహారం కావచ్చని అంటున్నారు. రాబోయే కొద్ది వారాలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి. అసెంబ్లీ సమావేశాల అనంతరం వెలువడే సమన్లు రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీయవచ్చు. నందకుమార్ అందించిన సమాచారం ఆధారంగా మరికొంత మంది అధికారులకు లేదా రాజకీయ నేతలకు కూడా సిట్ ఉచ్చు బిగించే అవకాశం ఉంది. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెనుక ఉన్న అసలు మాస్టర్ మైండ్ ఎవరు దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం కేవలం రాజకీయ సమాచార సేకరణా లేక మరేదైనా ఉందా అనే విషయాలు త్వరలోనే బయట పడే అవకాశం ఉంది.

మరోవైపు.. ఈ విచారణలో భాగంగా ప్రభాకర్ రావు పెద్ద కుమారుడు నిశాంత్ రావును కూడా సిట్ అధికారులు విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసులో జరిగిన ఆర్థిక లావాదేవీలపై అధికారులకు కొన్ని అనుమానాలు ఉండటంతో.. నిశాంత్ రావు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఏదైనా నిధుల మళ్లింపు జరిగిందా. లేదా ఇతర ఆర్థిక ప్రయోజనాలు పొందారా అనే కోణంలో అధికారులు ఆయన్ని ప్రశ్నించారు. ఈ విచారణ ద్వారా కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు సిట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో పాటు మీడియా సంస్థ అధినేత శ్రవణ్ రావును కూడా సిట్ బృందం విచారిస్తోంది. శ్రవణ్ రావుకు ఈ కేసులో ఉన్న ప్రమేయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రణీత్ రావు మినహా మిగిలిన నిందితులందరినీ ఒకే చోట చేర్చి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారు, డేటా ఎక్కడ భద్రపరిచారు అనే అంశాలపై స్పష్టత పొందేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కస్టడీ గడువు ముగియడంతో ప్రభాకర్ రావును తిరిగి కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ 14 రోజుల విచారణలో సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో సిట్ అధికారులు కోర్టుకు సమర్పించే అవకాశం ఉంది. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయ, పోలీస్ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.

# మావోయిస్టు అగ్రనేత గణేశ్ హతం

( మొదటి పేజీ తరువాయి )

దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా వర్ణించారు. "ఒడిశాలోని కంధమాల్‌లో జరిగిన ఒక భారీ ఆపరేషన్‌లో, కేంద్ర కమిటీ సభ్యుడు గణేశ్ ఉయికేతో సహా 6 మంది నక్సలైట్లు ఇప్పటివరకు హతమయ్యారు. ఈ కీలక విజయంతో, ఒడిశా నక్సలిజం నుండి పూర్తిగా విముక్తి పొందడానికి అంచున నిలిచింది. 2026 మార్చి 31వ తేదీలోపు నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని అమిత్ షా పోస్ట్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఓ చోట మావోయిస్టులు ఎదురుపడగా పరస్పరం కాల్పులు చోటుచేసుకున్నాయి. అందులో పలువురు మావోలు హతమయ్యారు. మరణించిన వారిలో గణేశ్‌తోపాటు రాజేశ్ తివారీ, చమ్రు, రూప ఉన్నారు. గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ తీవ్రవాదాన్ని అరికట్టడానికి, శాంతిని కొనసాగించడానికి నిరంతర ప్రయత్నాలను హైలైట్ చేస్తుందని ఒడిశా పోలీసులు తెలిపారు. అయితే హనుమంతు స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చందూరు మండలం పుల్లెంల గ్రామం అని అధికారులు తెలిపారు. అతడు





కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడు అని, హనుమంతుపై రూ.1.10 కోట్ల రివార్డు ఉందని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం రివార్డు ప్రకటించిందని వెల్లడించారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నాయకులలో ఒకరైన హనుమంతు నేడు హతమయ్యాడని చెప్పారు. అదే సమయంలో ఘటనాస్థలిలో ఒక రివాల్వర్, పాయింట్ 303 రైఫిల్, ఒక వాకీటాకీ సెట్, రెండు ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం బలగాల గాలింపు కొనసాగుతోంది. కంధమాల్, గంజాం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 20 స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్స్ (ఎస్ఓజీ) బృందాలు, రెండు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్( సీఆర్‌పీఎఫ్) బృందాలు, ఒక బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) దళాలతో కూడిన 23 బృందాలు మోహరించాయి. అయితే ఇటీవల మల్కన్‌గిరిలో 22 మంది మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి లొంగిపోయారు. మరోవైపు, 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని, ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని, ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. అయితే మార్చి 31, 2026 తర్వాత ఇటువంటి గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. దేశంలో నక్సలిజం సమస్య ఎందుకు తలెత్తిందని, వారికి సైద్ధాంతిక, ఆర్థిక, చట్టపరమైన మద్దతును ఎవరు అందిస్తున్నారని ప్రశ్నించారు.

## తెలంగాణ నంబర్ వన్ ద్రోహి కేసీఆర్

( మొదటి పేజీ తరువాయి )

ఇక కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ మాట్లాడిని భాష సరి కాదన్నారు. గురువారం మీడియా చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ పలు విషయాలపై స్పందించారు. 'కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష కరెక్ట్ కాదు. మనం మాట్లాడే భాష ఎదుటి వ్యక్తులను కించపరిచే విధంగా ఉండకూడదు. సీఎం తన భాషపై పునరాలోచన చేయాలి. ప్రతీ వ్యక్తి సుఖ సంతోషాలతో ఉండాలని హిందూ ధర్మం కోరుకుంటుంది. కేసీఆర్ కుమారుడు అహంకారం తలకెకినట్టు మాట్లాడుతారు. గతంలో కేసీఆర్ మాట్లాడితే మేము ఖండించాం. సీఎం రేవంత్ మాట్లాడిన తీరు ఆయనకే నష్టం' అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.



'తెలంగాణకు నంబర్ వన్ ద్రోహి కేసీఆర్. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ఏమీ చేశారో ఆధారాలతో సహా బయట పెట్టింది ముందు నేనే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. ముడుపుల కోసం 575 టీఎంసీలు అడగలేదు. కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు. అప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నేనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించాను. కాళేశ్వరం స్కాం నుంచి దృష్టి మరల్చేందుకు కేసీఆర్ కృష్ణ జలాలు ఇష్యూ తెరపైకి తెస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్, కేసీఆర్ మధ్య ఏం ఒప్పందం జరిగిందో చెప్పాలి. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం' అని బండి సంజయ్ పేర్కొన్నారు.


నీటి వాటాల అంశంలో తప్పు చేసిందే కేసీఆర్ అని అన్నారు. అప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగిందని.. నీటి పంపకాల అంశంలో అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలను ఓ ఐఏఎస్ అధికారి ట్వీట్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ తప్పుడు నిర్ణయాల వల్లే ఇందంతా జరిగిందని విమర్శించారు. అనేకసార్లు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ తప్పించుకున్నారన్నారు. కేసీఆర్‌ను రేవంత్ తిట్టడం వెనక సింపతీ పెంచే కుట్ర దాగుందని.. కానీ ఇందుకోసం మరీ ఇంత జుగుప్సాకరమైన భాష అవసరం లేదన్నారు. తెలంగాణాకు పట్టిన పెద్ద శని కేసీఆర్ కుటుంబమని బండి ధ్వజమెత్తారు. కేసీఆర్ శని కాబట్టే ప్రజలు ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని కామెంట్స్ చేశారు. రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు బండి సంజయ్. వారిపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్రమంత్రులు జైలుకెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పని తీరుపై కేంద్ర ప్రభుత్వం వద్ద అధారాలు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది మంత్రులు వేల కోట్ల భూములను అమ్ముకుంటున్నారని.. దీన్ని ఎప్పటికైనా బయటపెడతామని హెచ్చరించారు. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు జైలుకెళ్లడం ఖాయమని ఆయన చెప్పారు. కాళేశ్వరం స్కామ్ నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని కొత్తగా తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం లాగే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. అప్పుడు పథకాల అమలుపై ప్రజలు నిలదీస్తారని కేసీఆర్ కొత్త అంశాలను తెరపైకి తెచ్చేవారని.. ఇప్పుడు రేవంత్ సైతం అదే డ్రామా ఆడుతున్నారని కేంద్ర మంత్రి విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. తెలంగాణ ప్రజలు పన్నుల కడతలేదా. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నైరాశ్యంలో ఉన్నారు.. కాంగ్రెస్‌లో రహస్య సమావేశాలు జరుగుతున్నాయి.. త్వరలో తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు బండి సంజయ్. ఇద్దరు ముగ్గురు మంత్రులు బరితెగించి అక్రమంగా సంపాదించుకుంటున్నారని, మంత్రుల అక్రమ సంపాదనపై ఇంటెలిజెన్స్ బ్యూరో ద్వారా డేటా సేకరిస్తున్నాం.. అవినీతి మంత్రులు ఎప్పటికైనా జైలుకు వెళ్లక తప్పదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.

## కే4 మిసైల్ ప్రయోగం సక్సెస్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

భారత నేవీ బంగాళాఖాతంలో ఐఎన్ఎస్ అరిఘాత్ జలాంతర్గామి నుంచి కే4 బాలిస్టిక్ మిసైల్‌ను గురువారం విజయవంతంగా ప్రయోగించింది. ఈ క్షిపణి 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అంతేకాకుండా రెండు టన్నుల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. ఇది భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన ఘట్టంగా చరిత్రలో నిలవనుంది. ఇది దేశ న్యూక్లియర్ ట్రయాడ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఈ క్షిపణి, అణ్వస్త్రాలను కూడా మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంది. గతేడాది ఆగస్టు 29న ఇండియన్ నేవీలో ప్రవేశపెట్టిన ఈ క్షిపణి.. భారత్‌కు అత్యంత సుదూర లక్ష్యాలను చేధించగలిగే సముద్ర ఆధారిత వ్యూహాత్మక ఆయుధంగా నిలుస్తుంది. ఉపరితలం నుంచి ప్రయోగించే అగ్నిIII వెర్షన్‌ను సముద్రం జలాల నుంచి ప్రయోగానికి వీలుగా అభివృద్ధి చేశారు. ఈ క్షిపణి జలాంతర్గామి నుంచి బయటకు వచ్చి, నీటి ఉపరితలంపైకి తేలి, ఆపై రాకెట్ మోటారును మండించి గాలిలోకి దూసుకుపోయేలా మార్పు చేశారు. ఈ క్షిపణి 2.5 టన్నుల అణ్వాయుధాన్ని మోసుకెళ్లగలదు. అరిహంత్ శ్రేణి జలాంతర్గాముల నుంచి దీనిని ప్రయోగించవచ్చు.కే4 క్షిపణి, భారత అణ్వాయుధ త్రయంలో అత్యంత రహస్యమైనది. అరిహంత్‌శ్రేణి జలాంతర్గాములు సుదీర్ఘకాలం పాటు సముద్ర అడుగున నిశ్శబ్దంగా 'నిరోధక పెట్రోలింగ్' కోసం నిర్మించారు. 'కే' అనే అక్షరం, భారత్ ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో కీలక పాత్ర పోషించిన ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళిగా పెట్టారు.పూర్తి అణు సామర్థ్యంతో దేశీయ తొలి బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిహంత్'. ఇది 2018 నుంచి నేవీకి సేవలు అందిస్తోంది. దీని స్ఫూర్తి, డిజైన్, అనుభవంతో 'ఐఎన్ఎస్ అరిఘాత్'ను నిర్మించారు. భారత నౌకాదళంలో తొలి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్ర. దీనిని రష్యా నుంచి భారత్ లీజుకు తీసుకుంది. కానీ, 2011 డిసెంబరులో భారత్ సొంతంగా అణు జలాంతర్గాముల నిర్మాణాన్ని చేపట్టింది.



దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికే అమెరికా అణుబాంబులను తయారు చేసి ప్రయోగించింది. పి-5 దేశాల్లో (అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, బ్రిటన్) అమెరికానే మొదటిసారి అణ్వస్త్ర ప్రయోగం చేసింది. భారత్ విషయానికి వచ్చేసరికి తొలి ప్రధాని నెహ్రూ న్యూక్లియర్ విజ్ఞానం విధ్వంసం సృష్టించడానికి కాకుండా ప్రజా ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని నిర్ణయించుకున్నారు. ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సైతం ఇదే విధానానికి కట్టుబడి ఉన్నారు. భారత్ అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని ఎన్ని ఒత్తిడులు వచ్చినా వాటిని అధిగమించారే గానీ అణు పరిజ్ఞానం విధ్వంసక శక్తిగా మార్చడానికి అంగీకరించలేదు. ఇందిరాగాంధీ, వాజ్ పేయి ప్రభుత్వాలు ఇందుకు భిన్నంగా వ్యవహరించాయి. భారత దేశాన్ని అణ్వస్త్ర దేశంగా మార్చాయి. ఈ క్రమంలో భారతదేశాన్ని నిరోధించడానికి యూఎన్ఓ మూడు ఒప్పందాలను తీసుకువచ్చింది. ఇందులో పీటీబీటీపై సంతకం చేసిన భారత్, వివక్షతో కూడుకున్న న్యూక్లియర్ నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీ, సమగ్ర అణ్వస్త్ర నిషేధ ఒప్పందాలపై మాత్రం సంతకాలు చేయలేదు. ఈ ఒప్పందంపై 1963, ఆగస్టు 5న రష్యా రాజధాని మాస్కోలో అమెరికా, ఆనాటి సోవియట్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్ సంతకాలు చేశాయి. దీనిని లిమిటెడ్ టెస్ట్ బ్యాన్ ట్రీటీ(ఎల్‌టీబీటీ) అని కూడా అంటారు. ఈ ఒప్పందం 1963, అక్టోబర్ 10నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ఆకాశంలో గానీ అంతర జలాల్లో గానీ అణు పరీక్షలు నిర్వహించరాదు. భూ అంతర్భాగంలో మాత్రమే నిర్వహించవచ్చు. పాక్షిక పరీక్ష నిషేధ ఒప్పందంపై 1963లోనే భారత్ సంతకం చేయడంతోపాటు ధ్రువీకరణ కూడా చేసుకుంది. ఈ ఒప్పందాన్ని ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో 1996, సెప్టెంబర్ 10న ఆమోదం కోసం ప్రతిపాదించారు. ఆ సమయంలో 71 దేశాలు అంగీకారం తెలిపాయి. 2023, మార్చి నాటికి 186దేశాలు సంతకాలు చేశాయి. కానీ, 177 దేశాలు రాటిఫై చేసుకున్నాయి. ఇటీవల సోలమన్ దీవులు 2023, జనవరి 20న సీటీబీటీ ఒప్పందాన్ని ఆమోదించాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలైన బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, అమెరికా, చైనాలు సైతం సంతకాలు చేశాయి. సీటీబీటీలో 17 ప్రకరణలు, ఒక ప్రోటోకాల్ ఉన్నాయి. ఈ ఒప్పందం అన్ని రకాల అణుశక్తి ప్రయోగాలను వ్యతిరేకిస్తుంది. అయితే, ఈ ఒప్పందం రెట్టింపు వివక్షతతో కూడుకున్నదిగా పేర్కొంటూ భారత్‌తోపాటు పాకిస్తాన్, ఇజ్రాయెల్, ఉత్తరకొరియా సంతకం చేయలేదు. ప్రతి దేశం అణ్వాయుధ ప్రయోగాలు, తయారీ, అణు విధ్వంసాలను పూర్తిగా నిలిపివేయాలి. ఏ దేశం, ఇతర దేశాలు అణ్వాయుధాలను, అణు సామగ్రిని కలిగి ఉండటానికి ప్రోత్సహించరాదు. ఐదు అగ్రరాజ్యాలు అణ్వాయుధాల తయారీకి అణ్వాయుధ సామగ్రిని కాని, అణ్వాయుధాలను కాని ఎగుమతి చేయరాదు.

## ప్రపంచానికి భారతీయుల సత్తా చాటిన ధీశాలి



త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఎల్బీ నగర్, విశాలభారతి:

ప్రపంచానికి భారతీయుల సత్తా చాటిన ధీశాలి, భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి' అని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా.. ఎల్బీనగర్ లో మహనీయుల విగ్రహాల సమీపంలో ఏర్పాటు చేసిన వాజ్పేయి కాంస్య విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్తో కలిసి గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. జనసంఘ్ నుంచి బీజేపీని ఏర్పాటు చేసిన వాజ్ పేయి ప్రయాణం గొప్ప వక్త, కవిగా, అనిర్వచనీయమన్నారు. ప్రజాహృదయ నేతగా అటల్ బిహారీ వాజ్ పేయి దేశ మౌలిక సదుపాయాలకు బలమైన పునాది వేశారన్నారు. 'అగ్రదేశాలు ఆగ్రహిస్తాయని తెలిసినా.. అణుపరీక్షలు నిర్వహించి, ఆర్థిక స్థిరత్వం కోసం బాండ్ల రూపంలో 4 బిలియన్ డాలర్ల నిధులు సేకరించిన దేశం మెచ్చిన నేత వాజ్పేయి అన్నారు. వాజ్ పేయి ప్రతిపాదించిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారి విధానంతో దేశంలో రోడ్డు రవాణ వ్యవస్థ బలోపేతమైందన్నారు.జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొప్పుల నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ డ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్రెడ్డి, నర్సింహ్మా గుప్తా, నాయకులు బండారు భాస్కర్, యశ్పాల్ గౌడ్, కాచం వెంకటేశ్వర్లు మునగాల హరీశ్ రెడ్డి, వాజ్పేయి విగ్రహ నిర్వహణ కమిటీ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలే నా పాలనకు పునాది

**జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**ఎల్బీనగర్, విశాలభారతి:** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయశ్రీ కాలనీ సంక్షేమ భవనం పై అంతస్తులో రూ. 9.50 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును కాలనీ వాసులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఘనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులే తమ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, నాణ్యమైన పనులతో మన్సూరాబాద్ డివిజన్‌ను ఆదర్శంగా నిలపడం తమ బాధ్యత అని తెలిపారు.అతి త్వరలోనే అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా విజయశ్రీ కాలనీలో నూతన సి.సి రోడ్డు కూడా వేయడం జరుగుతుందని & అన్ని విషయాలలో మీకు అండగా నిలుస్తున్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ నాయకులు అధ్యక్షులు మోహన్ రెడ్డి, రాజేష్, నర్సిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, చంద్రారెడ్డి, శ్రీధర్ రెడ్డి, కొండల్ రెడ్డి, కిరణ్ మరియు బిజెపి నాయకులు మొరిశెట్టి సంతోష్ కుమార్, భీమనపల్లి సిద్ధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రాజేంద్రనగర్, విశాలభారతి:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చిలో జరిగిన వేడుకల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈ చర్చిని సందర్శించిన ఎమ్మెల్యే, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మైలార్దేవపల్లి లోని దుర్గా నగర్‌లోని ఈ చర్చిని సందర్శించి క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్‌ను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. సమాజంలో శాంతి, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కావేలిగూడలో యువకుడి దారుణ హత్య

**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఓ యువకుడిని మాట్లాడుకుందామని పిలిచిన గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవేలిగూడలో ఇవ్వాలా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన మహేష్ (26) స్థానికంగా హెయిర్ సెలూన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు మహేష్‌ను మాట్లాడుకుందామని కవేలిగుడా గ్రామ సమీపంలోకి పిలిపించుకొని కత్తులతో దాడి చేసి హత్య చేశారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మహేష్ హత్యకు గురయ్యాడని అనుమానాలు వ్యక్తమావు తున్నాయి. శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ న రేందర్ రెడ్డి తెలిపారు.

# సేవ్ ఆరావళి






( మొదటిపేజీ తరువాయి )

అక్కడ మాత్రమే మైనింగ్ నిషేధం వర్తిస్తుందని ప్రభుత్వం గతంలో పేర్కొంది. నిజానికి ఆరావళి శ్రేణిలోని దాదాపు 91 శాతం కొండలు 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులోనే ఉన్నాయి. ఈ నిబంధన వల్ల ఆ కొండలన్నీ మైనింగ్ మాఫియా చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఏర్పడింది. ఆరావళి పర్వత శ్రేణులు అపారమైన, అత్యంత విలువైన ఖనిజ సంపదకు నిలయాలు. ఈ ప్రాంతంలో లభించే పాలరాయి, గ్రానైట్ ప్రపంచ స్థాయి నాణ్యతకు పేరుగాంచాయి. ఇక్కడి మక్రానా పాలరాయితోనే తాజ్ మహల్ నిర్మించారు. వీటితో పాటు, ఇక్కడ లభించే సీసం, జింక్, రాగి, వెండి నిజాలు పారిశ్రామికంగా అత్యంత గిరాకీ కలిగి ఉంటాయి. అలాగే, సిరామిక్ పరిశ్రమలో వాడే ఫెల్డ్‌స్పార్, క్వార్ట్జ్ వంటి అలోహ ఖనిజాలు, అత్యంత నాణ్యమైన రాతి నుస్సు ఇక్కడ విస్తారంగా లభిస్తాయి. ఈ పర్వతాల్లోని ఖనిజాల రసాయన మిశ్రమం, దృఢత్వం కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో వీటికి భారీ డిమాండ్ ఉంది. అందుకే మైనింగ్ మాఫియా కన్ను ఎప్పుడూ వీటి మీద ఉంటుంది. కేంద్రం కొత్త ఉత్తర్వులతో 'సేవ్ ఆరావళి' ఉద్యమం ప్రారంభమైంది. సుప్రీంకోర్టు సైతం ఈ విషయంలో జోక్యం చేసుకుంది కానీ.. ఆ ఉత్తర్వును నిలిపివేయలేదు. కానీ కొత్త లీజులు ఇవ్వరాదని స్పష్టం చేసింది. ఒకవేళ చిన్న కొండలను మినహాయిస్తే థార్ ఎడారి వేగంగా విస్తరించి పర్యావరణ విపత్తు సంభవిస్తుందని నిపుణులు అంటున్నారు. అయితే మన దేశంలో మైనింగ్ అంటే పెద్ద స్కాం. అనుమతి లేకుండా తవ్వుకుపోయేదే చేస్తుంటారు. అందుకే ఆరావళిని కాపాడుకోవడం ఉత్తర్వులతో సాధ్యమా.. ఓ లూప్ హోల్ పెట్టిన తర్వాత అసలు సాధ్యమా అన్న ప్రశ్న వస్తోంది.

ఆరావళి పర్వత శ్రేణులకు దాదాపు 200 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇవి వాయువ్య భారతదేశంలోని గుజరాత్, రాజస్థాన్, హరియాణా, ఢిల్లీలో 670 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్నాయి. ఈ పర్వత శ్రేణుల్లోని అత్యధిక ఎత్తు 1,722 మీటర్లు. ఇవి ముడత పర్వతాలు. భూమి లోపల ఉండే టెక్టోనిక్ ప్లేట్లు ఒకదానికొకటి ఎదురెదురుగా బలంగా ఢీకొన్నప్పుడు, వాటి మధ్య ఉన్న భూభాగం పైకి ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఒత్తిడి వల్ల ఆ భూభాగం పైకి లేచి ముడతలు పడుతుంది. ఆరావళి పర్వత శ్రేణులు ఇలాగే ఏర్పడ్డాయి. ఇవి ఢిల్లీ శివారుల్లోని ఆరావళి ప్రాంతంలో ప్రారంభమై, దక్షిణ హరియాణా, రాజస్థాన్ మీదుగా నైరుతి గుజరాత్‌లోని అహ్మదాబాద్ వద్ద ముగుస్తాయి. రాజస్థాన్‌లోని మౌంట్ అబూ సమీపంలో 5,650 అడుగుల ఎత్తులో ఉండే గురు శిఖర్ ఆరావళి పర్వత శ్రేణులలోనిదే. రాజస్థాన్ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు నియంత్రణలో ఉండేందుకు, జల భద్రతకు ఈ పర్వతాలు అత్యంత కీలకమైనవి. ఇవి రాజస్థాన్‌లోని థార్ ఎడారి వేగంగా వ్యాప్తి చెందకుండా నిలువరిస్తున్నాయి. ఈ రాష్ట్రంలోని నేలలో భూగర్భ జలాలను రీఛార్జ్ చేస్తున్నాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం కనీసం అప్పుడప్పుడు అయినా తగ్గుతోందంటే అందుకు కారణం ఆరావళి పర్వతాలే.

ఈ పర్వతశ్రేణుల పరిధిలో పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో మైనింగ్‌ను సుప్రీం కోర్టు పూర్తిగా నిషేధించింది. సుస్థిర మైనింగ్ నిర్వహణ ప్రణాళిక (ఎంపీఎస్ఎం) సిద్ధమయ్యే వరకు ఆరావళి ప్రాంతంలో కొత్త మైనింగ్ లీజులను మంజూరు చేయొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. భారతీయ అటవీ పరిశోధన, విద్యా మండలి (ఐసీఎఫ్ఆర్ఈ) ద్వారా మొత్తం ఆరావళి శ్రేణికి సంబంధించి ఒక సమగ్ర సుస్థిర మైనింగ్ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర పర్యావరణ శాఖకు ఆర్డర్ ఇచ్చింది. ఆరావళి పర్వత శ్రేణులు థార్ ఎడారి విస్తరించకుండా అడ్డుకునే సహజ రక్షణ కవచమని, భూగర్భ జలాల రీఛార్జ్, వాతావరణ సమతుల్యతకు ఇవి అత్యంత అవసరమని కోర్టు నొక్కి చెప్పింది.

''ఆరావళి పర్వత శ్రేణుల భౌగోళిక స్వరూపం పై స్పష్టత కోసమే, వాటికి ఒక నిర్దిష్ట నిర్వచనాన్ని ఇచ్చాం. ఆ పర్వతాల్లో అక్రమ మైనింగ్ జరగకుండా నిలువరించడానికే ఈ చర్యను చేపట్టాం. ఆరావళి పర్వతాలను రక్షించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆ పర్వత శ్రేణుల్లో క్షీణించిన ప్రాంతాలను పునరుద్ధరించడానికి మేం ఇప్పటికే 'గ్రీన్ ఆరావళి వాల్' ప్రాజెక్టును మొదలుపెట్టాం. సుప్రీంకోర్టు ఇటీవలే ఆమోదించిన నిర్వచనం ప్రకారం ముందుకు సాగుతాం. 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు కలిగిన ఆరావళి పర్వత శ్రేణులను రక్షిస్తాం. ఆరావళి పర్వత ప్రాంతాల్లో 0.19 శాతం మాత్రమే మైనింగ్‌కు అనుమతి ఉంటుంది. వాటిలో కొత్త గనులకు మేం అనుమతులు ఇవ్వలేదు. దాదాపు 90 శాతం ఆరావళి పర్వత శ్రేణులకు రక్షణ కొనసాగుతోంది. ఈవిషయంలో ఎలాంటి సడలింపును మేం ఇవ్వలేదు. దీనిపై కొందరు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు'' అని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ స్పష్టత ఇచ్చారు.

ఆరావళి పర్వత శ్రేణుల కొత్త నిర్వచనంలోని 100 మీటర్ల ఎత్తు నిబంధనపై పలువురు పర్యావరణవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆరావళి శ్రేణులలోని దాదాపు 91 శాతం పర్వతాలు 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులోనే ఉన్నాయని చెబుతున్నారు. ఈ కొత్త నిబంధన వల్ల దాదాపు 91 శాతం ఆరావళి పర్వత శ్రేణులు చట్టపరమైన రక్షణను కోల్పోయే ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎత్తులు, కొలతల ప్రాతిపదికన పర్వత శ్రేణుల లాంటి భారీ పర్యావరణ వ్యవస్థలను నిర్వచించలేమని పర్యావరణవేత్తలు అంటున్నారు. కొండలు, అడవులు, పరీవాహక ప్రాంతాలు అనేవి ఒకదానితో ఒకటి పరస్పరం అనుసంధానితమై ఉంటాయని, వాటిని వేరుచేసి చూడలేమని గుర్తు చేస్తున్నారు. అన్ని ఎత్తుల ఆరావళి పర్వతశ్రేణులతో పాటు వాటి పరిసర ప్రాంతాలను రక్షిత జోన్‌లుగా పరిగణించాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. 100 మీటర్ల ఎత్తు నిబంధన మైనింగ్, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల నిర్మాణ కంపెనీలకు వెసులుబాటును కల్పించేలా ఉందని ఆరోపిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే ఆరావళి పర్వత శ్రేణులు దెబ్బతిన్నాయని అంటున్నారు.

ఆరావళి పర్వతశ్రేణుల భద్రతకు భంగం కలిగితే, వాటిలోని జీవరాశులు, గిరిజన, ఆదివాసీ జాతుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రత్యేకించి ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతాలలో గాలి నాణ్యత మరింత తగ్గుతుంది. గుజరాత్, రాజస్థాన్, హరియాణా, ఢిల్లీలలో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడుతుంది. రాజస్థాన్‌లోని థార్ ఎడారి వేగంగా విస్తరిస్తుంది. ఆరావళి పర్వతశ్రేణుల భద్రతపై భారత ప్రజల ఆందోళన సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఎంతోమంది పర్యావరణ వేత్తలు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, న్యాయవాదులు, పర్యావరణ సంస్థలు సేవ్‌ఆరావళి హ్యాష్‌ట్యాగ్‌తో 'ఎక్స్' వేదికగా ట్వీట్లు చేస్తున్నాయి. సాంకేతికపరమైన నిర్వచనాలను ఇవ్వడం ద్వారా ఆరావళి పర్వతశ్రేణుల భద్రతను బలహీనపర్చొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దీంతో ఇప్పుడిది జాతీయ స్థాయి చర్చనీయాంశంగా మారింది. ఆరావళికి ఏదైనా జరిగితే తిరిగి పొందలేమని, ఇప్పుడే ఆ పర్వతశ్రేణుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు కోరుతున్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న సేవ్‌ఆరావళి ప్రచారానికి రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లోత్ 'ఎక్స్' వేదికగా మద్దతును ప్రకటించారు. ఆరావళి పర్వతశ్రేణులకు ఇచ్చిన కొత్త నిర్వచనం అనేది తమ రాష్ట్రంలోని దాదాపు 90 శాతం ఆరావళి పర్వతాల భద్రతను ప్రశ్నార్థకం చేసేలా ఉందని ఆయన ఆరోపించారు. మైనింగ్ కంపెనీల ప్రయోజనాలకు అనుగుణంగా పర్వతశ్రేణుల ఎత్తులను నిర్ణయించడం సబబు కాదని అశోక్ గెహ్లోత్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి నిర్ణయాల వల్ల దీర్ఘకాలంలో భారత దేశ పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కంటే కార్పొరేట్ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోని సబర్కాంత జిల్లాలోనూ ఆరావళి పర్వత శ్రేణులు ఉన్నాయి. 100 మీటర్ల ఎత్తు నిబంధనపై ఈ జిల్లాలోని విజయనగర్‌లో ఉన్న దద్వావ్ ఏరియా ప్రజలు మండిపడ్డారు. పెద్దసంఖ్యలో స్థానికులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. తమ ప్రాణాలను త్యాగం చేసైనా ఆరావళిని కాపాడుకుంటామని వారు ప్రకటించారు. తమ సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక వారసత్వంలో కీలక భాగమైన ఆరావళి పర్వత శ్రేణులను పరిరక్షించుకుంటామని తేల్చి చెప్పారు. సబర్కాంత జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. భావి తరాలు ఆరావళి శ్రేణులను పోస్టర్లలో చూసుకోవాల్సిన పరిస్థితిని తేకూడదని సూచిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కేంద్ర సర్కారుకు విన్నవిస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో అల్లరీ మూకల అరాచకం తారాస్థాయికి చేరింది

- హిందువులనే టార్గెట్‌గా దాడులు చేస్తున్నారు
- ఇటీవల దీపు చంద్రదాస్‌ను క్రూరంగా హత్య చేశారు
- తాజాగా 29 ఏళ్ల అమృత్ అనే హిందూ యువకుడిపై దాడి
- ఆ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు
- అల్లర్ల నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ స్వదేశానికి తిరిగివచ్చారు




**విశాలభారతి, నేషనల్:**

బంగ్లాదేశ్‌లో అల్లరీ మూకల అరాచకం తారాస్థాయికి చేరింది. అక్కడ హిందువులనే టార్గెట్‌గా దాడులు చేస్తున్నారు. ఇటీవల దీపు చంద్రదాస్‌ను అత్యంత క్రూరంగా దాడి చేసి కొంత మంది అల్లరి మూకలు హత్య చేసిన విషయం తెలిసిందే. ఇంట్లో ఉన్న దీపుదాస్‌ను రాత్రిపూట అల్లరి మూకలు బైటకు లాక్కొచ్చి మరీ దాడులు చేసి ఉరివేసి, చెట్టుకు వేలాడదీసి తగలబెట్టారు. ఈ దారుణంను వీడియోలు తీస్తు పైశాచీక ఆనందంను పొందారు. ఈ ఘటననై యావత్ భారతావణి తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో బంగ్లాలో ఉన్న హిందువులను భారత్‌కు వచ్చేలా చర్యలు తీసుకొవాలని డిమాండ్‌లు భారీగా వస్తున్నాయి. మరోవైపు బంగ్లాదేశ్ లో ఇంకా అల్లరిమూకలు రెచ్చిపోతునే ఉన్నారు. దీపుదాస్ ఘటన మరువక ముందేమరో ఘోరం వెలుగులోకి వచ్చింది. రాజ్‌బర్ జిల్లాలోని పంగ్షా సర్కిల్‌లో ఈ ఘోరం చోటు చేసుకుంది. 29 ఏళ్ల అమృత్ మొండల్ అలియాస్ సామ్రాట్‌పై బుధవారం రాత్రి గ్రామస్థులు దాడి చేసిఇంటి నుంచి బైటకు లాక్కెళ్లారు. అతనిపై మూకదాడి చేశారు. సామ్రాట్ బహిన్ పేరిట డబ్బులు వసూలు చేస్తూ, ఒక క్రిమినల్ గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. షేక్ హసీనా భారత్ కువెళ్లిన తర్వాత అతను రహస్య ప్రదేశంలోకి వెళ్లిపోయాడు. అయితే.. ఇటీవల గ్రామంకు వచ్చిన సామాట్..అదే గ్రామానికి చెందిన మరోక కుటుంబంలో వెళ్లి డబ్బులు డిమాండ్ చేసినట్లు అక్కడి వారు చెబుతున్నారు. దీంతో వారంతా చుట్టుముట్టి సామ్రాట్‌ను బైటకు లాక్కొచ్చి దాడులు చేసినట్లుచెబుతున్నారు. దీంతో అతని గ్యాంగ్ పారిపోయారు. అతనిపై హత్యా నేరం సహా రెండు కేసులు ఉన్నాయి. షేక్ హసీనా దేశం విడిచి వెళ్ళిన తర్వాత సామ్రాట్ కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్ళాడని తెలిపారు. ఇటీవలే గ్రామానికి చేరుకున్న సామ్రాట్, అదే గ్రామానికి చెందిన షాహిదుల్ ఇంటికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేయడంతో కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేశారు. దీంతో గ్రామస్థులు సామ్రాట్‌ను చుట్టుముట్టి దాడి చేయగా, అతని గ్యాంగ్‌లోని ఇతర అనుచరులు పారిపోయారు. మహమ్మద్ సామ్రాట్ ను పోలీసులు వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు వైద్యులు చెబుతున్నారు. మరోవైపు తన సామ్రాట్ కుటుంబం మరోలా చెబుతుంది. తన కొడుపై లేని ఆరోపణలు చేస్తున్నారని ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయలేదని చెబుతున్నారు. దీనిపై బంగ్లా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటన ప్రస్తుతం దేశ వ్యాప్తంగా మరోసారి సంచలనంగా మారింది.

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ యాక్టింగ్ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ స్వదేశానికి తిరిగివచ్చారు. సుమారు 17 ఏళ్లపాటు లండన్ నుంచి పార్టీ వ్యవహారాలు పర్యవేక్షించిన ఆయన.. కుటుంబంతో కలిసి ఇవాళ ఢాకాలో అడుగు పెట్టారు. ఆయన రాక నేపథ్యంలో ఢాకా విమానాశ్రయం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. తారిఖ్ రాకను ఆ పార్టీ కార్యకర్తలు సెకండ్ ఇన్నింగ్స్‌గా అభివర్ణిస్తున్నారు. వచ్చే ఏడాది బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధికారంలోకి వస్తే భారత్‌తో సంబంధాలు ఎలా ఉంటాయనే చర్చ జరుగుతోంది. షేక్ హసీనా నాయకత్వంలోని బంగ్లాదేశ్‌తో భారత్‌కు సత్సంబంధాలు ఉండేవి. ఆమె పదవీచ్యుతురాలు అయ్యాక ఢిల్లీలో తల దాచుకున్నారు. కానీ తాత్కాలిక యూనస్ ప్రభుత్వంతో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బంగ్లాదేశ్ క్రమంగా పాకిస్థాన్‌కు దగ్గరవుతోంది.

ఈ క్రమంలో త్వరలో జరగబోయే జనరల్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఆ పార్టీతో భారత్‌కు చెప్పుకోదగిన సంబంధాలు లేకపోయినప్పటికీ, దానిని భారత్ ఒక ప్రజాస్వామ్య పార్టీగా పరిగణిస్తోంది. ఆ పార్టీతో భారత్ సత్సంబంధాలు పునరుద్ధరించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా తారిఖ్ రెహమాన్ తల్లి ఖలీదా జియా ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్యంపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేయగా.. దానిని బీఎన్‌పీ సానుకూలంగా స్వీకరించింది. అంతేకాదు ప్రస్తుత యూనస్ ప్రభుత్వం విధానాలను రెహమాన్ వ్యతిరేకిస్తున్నారు. జమాత్‌ఇస్లామీతో పొత్తుకు కూడా రెహమాన్ సుముఖంగా లేరు. జమాత్‌ఇస్లామీ పాకిస్థాన్ ఐఎస్ఐకి అనుకూలంగా వ్యవహరిస్తోందనే వాదనలు ఉన్నాయి. అందుకే షేక్ హసీనా హయంలో ఈ సంస్థపై నిషేధం విధించారు. యూనస్ ప్రభుత్వం వచ్చాక ఆ సంస్థ మళ్లీ క్రియాశీలకంగా మారింది. భారత్, పాకిస్థాన్‌లకు రెహమాన్ సమదూరం పాటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'ఢిల్లీ కాదు, రావల్పిండి కాదు, బంగ్లాదేశ్ తర్వాతే ఎవరైనా' అని తారిఖ్ రెహమాన్ అన్నారు. అయితే యూనస్ మాత్రం పాకిస్థాన్‌కు దగ్గరగా ఉంటూ, భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.

## మెదక్ చర్చికి పోటెత్తిన భక్తులు

- మెదక్ కేథడ్రాల్ చర్చిలో క్రిస్మస్ వేడులకు వైభవంగా జరిగాయి
- ఆరాధన కార్యక్రమం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైంది
- క్రిస్మస్ సందర్భంగా చర్చిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు
- ప్రభుత్వం రూ. 29 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు చేసింది
- ఆరాధకులు అత్యంత భక్తి శ్రద్ధలతో క్రీస్తును ఆరాధించారు
- ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ కేథడ్రాల్ చర్చిలో ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా మొదటి ఆరాధన కార్యక్రమం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైంది. ఏసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకొని చర్చిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మెదక్ చర్చి బిషప్ రూబెన్ మార్క్ తన శాంతి సందేశాన్ని భక్తులకు అందించారు. ''ఏసుక్రీస్తు రాకకై ప్రజలందరూ వారివారి గృహాలపై, ముఖ్యంగా క్రైస్తవులు నక్షత్రాన్ని గుర్తుగా పెడతారు. ఈ నక్షత్రం సినిమాలలో చూపించే సూపర్ స్టార్, జూనియర్ స్టార్ లాంటిది కాదు. ఈస్టార్ ఒక ప్రపంచానికే వెలుగునిచ్చే స్టార్'' అని భక్తులకు ఆయన దైవసందేశం ఇచ్చారు. అనంతరం మెదక్ చర్చి ప్రెస్ బీటర్ ఇంచార్జ్ శాంతయ్య మాట్లాడుతూ, గత సంవత్సరం డిసెంబర్ 25న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సుమారు 29 కోట్ల 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. దానికి తగినట్టుగానే అభివృద్ధి జరిగిందని, దీనికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం 4 గంటలకు మొదటి ఆరాధన సమయంలో క్రీస్తు సిలువను చర్చిలో ఊరేగించి వేదిక మీదకు తీసుకొని వచ్చారు. ఆరాధకులు అత్యంత భక్తి శ్రద్ధలతో క్రీస్తును ఆరా ధించారు. చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ, శాంటా క్లాస్, లోపల అలంకరించిన విద్యుత్ కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

యేసయ్యను ఆరాధిస్తూ ప్రార్థనలు చేశారు. భక్తులు బైబిల్ పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,. కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తులను ఉద్దేశించి మైనంపల్లి హనుమంతరావు మాట్లాడారు. కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు గంగాధర్, చంద్ర పాపాల్, రాగి అశోక్, మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్, మాజీ ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్ కృష్ణారెడ్డి, రాజు, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

మెదక్ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మెదక్ చర్చి సంఘ కాపరులు, గెలన్, గంట సంపత్, తదితరులు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు చర్చి వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లాలో గ్రామగ్రామాన చర్చిలలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి చర్చికి 30 వేల రూపాయలు ప్రభుత్వం ఇవ్వడంతో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేసుకుని క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

చర్చి నిర్మాణంలో పలు చారిత్రక అద్భుత కట్టడాలు ఉన్నాయి. చర్చి లోపల 40 స్తంభాలు ఉన్నాయి. పైకప్పు ఎక్కడ చూసినా సిలువ ఆకారంలో ఉండడం ప్రత్యేకత. అలాగే చర్చి లోపలికి వెళ్తుంటే పది మెట్లు తర్వాత చుట్టూరా 66 చొప్పున ఎడమ కుడి వైపు విద్యుత్ సొబగులు సమకూరేల తామర పూలతో నిర్మించిన దిమ్మెలు గొలుసులతో కలపబడి ఉంటాయి. బైబిల్ లోని 66 గ్రంథాలకు సూచికగా 66 దిమ్మెలు ప్రతిగగా నిలుస్తున్నాయి.. ఏసుప్రభుకు ప్రధానంగా 12 మంది శిష్యులు ప్రపంచవ్యాప్తంగా సువార్తను పరిచయం చేయాలని ప్రభువు వారికి బోధన చేశారు. ఆయన 12 మంది శిష్యులకు గుర్తుగా 12 మెట్లు చర్చిలో నిర్మించారు.

చర్చి మొత్తం మూడు గాజు కిటికీలు ఉన్నాయి. వీటిని ఇంగ్లాండ్ కు చెందిన ఫ్రాంక్ ఓ సాలిజ్బారి రూపొందించారు. చర్చి లోపల ఆరాధించే స్థలంలో ఒకటి చొప్పున ఉత్తరం, తూర్పు, పడమర వైపు నిర్మించారు. ఈ కిటికీలపై సూర్యకిరణాలు పడితేనే అపురూప దృశ్యాలు కనబడతాయి.

## భువనేశ్వరి నగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**విశాల భారతి, పెద్దఅంబర్‌పేట్ :**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద అంబర్‌పేట్ భువనేశ్వరి నగర్ కాలనీలోని చర్చిలో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చి పాస్టర్ హేమలత రవి ఆహ్వానం మేరకు బీఎస్పీ సోషల్ మీడియా కన్వీనర్ (రంగారెడ్డి జిల్లా) ప్రహ్లాద్ యంజాల ఈ వేడుకలకు హాజరయ్యారు. అలాగే నిరీక్షణ ప్రార్థన మందిరం పాస్టర్ జాన్ పాల్ ఆహ్వానం మేరకు కూడా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రైస్తవ సమాజం ఐక్యత, ప్రేమ, సోదరభావం గురించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందేశాన్ని వివరిస్తూ శాంతి, సేవ, మానవత్వం విలువలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెరుకూరి జగన్, కాంగ్రెస్ పార్టీ జిహెచ్ఎంసి పెద్ద అంబర్‌పేట్ సర్కిల్ మహిళా అధ్యక్షురాలు యంజాల సంజీవ పరమేశ్వరి, మైత్రి శ్రీపురం కాలనీ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి వెంకటేష్ గౌడ్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.వేడుకల సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని, క్రిస్మస్ పర్వదినం సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.



## పట్లూర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా లక్ష్మణ్ టీం

**మర్పల్లి, విశాలభారతి:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని పట్లూర్ గ్రామంలో గత మూడు రోజుల నుండి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. బుధవారం ఫైనల్ మ్యాచ్ లో లక్ష్మణ్ మరియు జీవన్ జట్టులు తలపడగా విజేతగా లక్ష్మి టీం నిలిచింది. రెండవ విజేతగా జీవన్ జట్టు ఉంది. సీనియర్ టీం ఫ్రెండ్లీ మ్యాచ్ ఏర్పాటు చేయగా ఫైనల్స్ కి మంగపల్లి సురేష్ జట్టు మరియు బంటు పృథ్వీరాజ్ జట్టులు మ్యాచ్ ఆడగా బంటు పృథ్వీరాజ్ జట్టు విజేతగా నిలిచింది. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగడంతో యువకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అందరినీ ఒకటి చేసే విధంగా క్రీడలు తోడ్పడుతయని పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్ ల గెలుపొందిన విజేతలకు ట్రోఫీ, షీల్డ్ లను అందజేశారు.ఆర్గనైజేషన్ టీం వినయ్ చింటూ చంటి దివాకర్ మలంగపల్లి నవీన్ లక్ష్మణ్ జీవన్ మరియు సంఘ పెద్దలు పాల్గొన్నారు.



# యువతకు జాబ్ గ్యారెంటీతో ఉచిత స్కిల్ ట్రైనింగ్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్(ఎల్ ఎస్సీ),రెడింగ్టన్ ఫౌండేషన్(కోలేటీ) సహకారంతో జాబ్ గ్యారెంటీతో కూడిన ఉచిత స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లాజిస్టిక్స్ రంగానికి చెందిన వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించి, శిక్షణ పూర్తైన అనంతరం 100 శాతం ప్లేస్‌మెంట్‌తో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపిక డ్రైవ్‌లో 29 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా, మొత్తం 51 మంది యువతి, యువకులు శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. మరింత మందికి అవకాశం కల్పించేందుకు ఈ నెల 27 న ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో మరో ప్రత్యేక ఎంపిక డ్రైవ్ నిర్వహించి అదనంగా 50మంది యువతను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో వేర్‌హౌస్ స్టోర్ కీపర్, సప్లై చైన్ అసోసియేట్, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు ఉండగా, 10వ తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి 18 నుంచి 27 సంవత్సరాల వయస్సు ఉన్న యువతి, యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు రూ13,000 నుంచి రూ18,000 వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమై స్కిల్ ఇండియా సర్టిఫికేషన్ కలిగి ఉండటంతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కూడా ఉంటాయని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.



## బోరు వేయించిన సర్పంచ్



**నిజామాబాద్, విశాలభారతి:** రెంజల్ మండలంలోని సాట పూర్ దళితవాడలో తాగునీటి ఇబ్బంది నేపథ్యంలో నూతనంగా గెలుపొందినటువంటి సర్పంచ్ లచ్చా వారి సువాసిని నితిన్ బోరును వేయించడం జరిగింది. మూడు ఇంచుల నీరు రావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు .గత కొన్ని సంవత్సరాల నుంచి తాగునీరు కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎన్నికల్లో భాగంగా తమకు సర్పంచ్ హామీ ఇవ్వడంతో నేరుగా ఈరోజు బోరు వేయించడం జరిగిందని ఈ సందర్భంగా సర్పంచ్ సువాసిని నితిన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## చిట్టబోయిన మధు కుటుంబాన్ని పరామర్శ

- ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రానికి చెందిన చిట్టబోయిన మధు ఇటీవల లింగాల ఘనపురం మండలం, నెల్లుట్ల గ్రామం వద్ద జనగామసూర్యాపేట ప్రధాన రహదారిలో యాక్సిడెంట్ అయి మరణించగా ఈ విషయం తెలుసుకొని ఈ రోజు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని ఓదార్చి అన్ని విధాలుగా అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య,మండల నాయకులు ఈదునూరి రాజు రెడ్డి,జక్కుల గంగరాజు,పల్లపు రవి,నీలారపు చిన్న వెంకన్న,పులిగిల్ల ఎల్లయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## షిలో బాప్టిస్టు చర్చిలో ఘనంగా క్రిస్టమస్ వేడుకలు



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** నేడు క్రిస్మస్ సందర్భంగా అడవిదేవులపల్లి మండలం కాలవకట్ట గ్రామంలో యేసుక్రీస్తును స్మరిస్తూ పర్వదినాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ఉత్సాయపాలెం కాలువ కట్ట గ్రామ పంచాయతీ క్రిస్టమస్ పర్వదినాన్ని కేక్ కటింగ్ లతో ఆటపాటలతో చిన్నారుల సందడిలతో పాస్టర్ పౌల్ ఆధ్వర్యంలో క్రిస్టమస్ పర్వదినాన్ని ఆనంద విలయాలుగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో సువార్తికుడు దాసు ఎం ప్రకాష్ జి శీను బి హనుకు ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కంచనపల్లి అభివృద్ధి దిశగా తొలి అడుగు



**కంచనపల్లి, విశాలభారతి:** మండలంలోని కంచన పెల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ చెడే అంబేద్కర్ ఆధ్వర్యంలోభువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షల సీసీ రోడ్ పనులను ఈరోజు కమ్మగూడెంలో ప్రారంభించారు.ప్రమాణ స్వీకారం చేసి మూడు రోజులు కూడా కావకముందే, గ్రామ అభివృద్ధి పట్ల ఉన్న తపనతో ఏదో చేయాలనే ఆశయం, మార్పు తీసుకురావాలనే సంకల్పం”తో సర్పంచ్ అంబేద్కర్ తన వాగ్దానాలను కార్యరూపం దాల్చడం గ్రామ ప్రజల్లో కొత్త ఆశ జలపాతం నింపింది.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ ఎల్లంల లింగయ్య, లొడంగి విఘ్నేశ్వరి - అఖిల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకు వెంకన్న గారు, మాజీ సర్పంచ్ కుక్కునూరు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.కంచనపల్లి గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో దూసుకెళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్న యువనేత ప్రజల అభివృద్ధిదాతగా సర్పంచ్ అంబేద్కర్ చేపట్టిన ఈ తొలి కార్యక్రమం గ్రామ ప్రజల్లో మంచి విశ్వాసం నింపింది.

## క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే డా భూపతి రెడ్డి



**నిజామాబాద్, విశాలభారతి:** జీసస్ లవ్ చర్చ్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైై రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి క్రైస్తవ సంఘాలకు పండగ జరుపుకోవడానికి ప్రతి ఒక్క సంఘానికి 30వేల చొప్పున డబ్బులు ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం మీ అందరికీ అండగా ఉంటుందని ఎన్నో కార్యక్రమాలు గొప్పగా జరుపుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి మీకు కృషి చేస్తున్నాడని వారన్నారు నిజామాబాద్ రూరల్ ప్రాంతాల్లో ప్రతి ఒక్క క్రైస్తవ బిడ్డలకు శుభాకాంక్షలు అని తెలుపడం జరిగినది. జీసస్ లవ్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని దైవజనులు ఆనంద్, దైవజనురాలు ష్తోత్రరాణి వారితో పాటు భక్తులు క్రైస్తవులు క్రిస్మస్ పండగ కేకును కట్ చేసి శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ఇమ్మడి గోపి. మాజీ ఎంపీటీసీ క్యాతం హనుమండ్లు. మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు.. మాజీ ఎంపీటీసీ నారాయణ,గౌడ్. మాజీ సర్పంచ్ పద్మ నారాయణ. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రవి. కాలనీ వాసులు భూషణ్,రమేష్తదితరులు పాల్గొన్నారు.

## యువతతోనే గ్రామాల అభివృద్ధి




- సర్దార్నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి

**మొయినాబాద్, విశాలభారతి:** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే యువతతోనే సాధ్యమైన సర్దార్నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి, కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వడ్ల వెంకటయ్యచారిలు అన్నారు. గురువారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్ గోడుగు యాదయ్య యువనాయకులను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సూచించారు. యువత తప్పుడు ఆలోచన లేకుండా దురలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో, గ్రామ పెద్దలతో కలిసి పని చేయాలన్నారు. అప్పుడే యువతకు మంచిపేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటారని సూచించారు. కేతిరెడ్డిపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గోడుగు యాదయ్య సేవా కార్యక్రమాలతో పాటు కేతిరెడ్డిపల్లి, కంచమోనీగూడ గ్రామాల ప్రజలు ఆదరించి అభిమానించి అధిక మెజార్టీతో మంచి వ్యక్తిని ఎన్నుకున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదమే తనకు కొండంత బలంగా ఉందని నూతన సర్పంచ్ గోడుగు యాదయ్య పేర్కొన్నారు. ప్రజలు ఆదరించి అభిమానించి గెలిపించినందుకు మరింత సేవలు చేసేందుకు తనవంతు కృషిగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్రెడ్డి, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిధులు ప్రకటించడం అభినందనీయం

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంచార్జ్ టిపిసిసి అధికార ప్రతినిధి గౌరీ సతీష్

**మొయినాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా గెలుపొందిన సర్పంచ్లకు గ్రామాల అభివృద్ధికి సర్పంచ్లందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం ప్రకటించడం అభినందనీయమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టిపిసిసి అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామాన్ని ఆయన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రజలకు కేక్ పంచిపెట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా కలిసి ఉన్నప్పుడే సంతోషంగా పండుగలు జరుపుకుంటామని తెలిపారు గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన సర్పంచ్ అందరికీ నిధులు ప్రకటించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు చిన్న గ్రామాలకు ఐదు లక్షలు పెద్ద గ్రామాలకు 10 లక్షల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించడం జరిగిందని ఆయన అన్నారు గడిచిన టిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు కొత్తగా ఏర్పడి సర్పంచ్లు బాధ్యతలు తీసుకున్న వెంటనే గ్రామాల



మెయింటెనెన్స్ అభివృద్ధి కోసం నిధులు ఇస్తున్నామని తెలపడం ఆదర్శనీయమని ప్రకటించారు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత సర్పంచి పాలకవర్గానిదేనని ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్రంలో అన్ని గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు గ్రామాలలో ముఖ్యంగా యువత సర్పంచులు అధికంగా గెల్పొందారని యువతతో కలిసి ప్రజాప్రతినిధులు అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన కోరారు గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

## జిల్లావ్యాప్తంగా మిన్నంటిన 'క్రిస్మస్' సంబరాలు


- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

**నిజామాబాద్, విశాలభారతి:** లోకరక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని తాకాయి. తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి, కుటుంబ సమేతంగా చర్చిలకు తరలివచ్చారు. నగరంల. ముబారక్ నగర్. జీసస్ లవ్... చర్చ్అలాగే ఇతర ప్రధాన చర్చిలన్నీ విద్యుద్దీప కాంతులతో ధగధగలాడాయి. 'హ్యాపీ క్రిస్మస్' అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో ప్రార్థనా మందిరాలు కోలాహలంగా మారాయి. ప్రార్థనల అనంతరం పాస్టర్లు కేక్ కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు బైబిల్‌లోని అంశాలను ఉటంకిస్తూ ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని, ఆయన చాటిన శాంతి, ప్రేమ, కరుణ సందేశాలను వివరించారు. మానవాళి సంక్షేమం కోసం క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని ఉద్బోధించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక



ఆకర్షణగా నిలిచాయి. శాంటాక్లాజ్ (క్రిస్మస్ తాత) వేషధారణలో చిన్నారులు చేసిన అల్లరి, ఏసుక్రీస్తు జీవిత విశేషాలపై వేసిన నాటికలు చూపరులను కట్టిపడేశాయి. పలు చర్చిల వద్ద ఏర్పాటు చేసిన గొర్రెల కాపరుల ప్రదర్శనలు, నక్షత్ర తోరణాలు పండుగ శోభను ద్విగుణీకృతం చేశాయి. గ్రామాల్లో సైతం క్రైస్తవ సోదరులు విందు వినోదాలతో పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

## బీజేపీలో చేరిన బీఆర్ఎస్ యువజన నాయకులు



**చౌటుప్పల్ విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ దేశంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు అంకిరెడ్డిగూడెం బిఆర్ఎస్ విద్యార్థి యువజన అధ్యక్షులు పర్నే భరత్ రెడ్డి,మరికొందరు బిఆర్ఎస్ విద్యార్థి కార్యకర్తలు బిజెపి పార్టీలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా వారిని బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగొని శంకరయ్య మరియు మండల ఉపాధ్యక్షులు పర్నే శ్రీను రెడ్డి వారికి బిజెపి పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనా ఐలయ్య యాదవ్,30వ బూత్ అధ్యక్షులు బత్తుల మహేష్‌గౌడ్,పర్నే శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎలోహీమ్ మినిస్ట్రీస్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**క్రీస్తు దీవెనలు అందరికీ కలగాలి: బ్రదర్ చింతా భాస్కర్**



**కోదాడ, విశాలభారతి:** లోకకల్యాణం కోసం జన్మించిన యేసుక్రీస్తు ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎలోహీమ్ మినిస్ట్రీస్ చర్చ్ నిర్వాహకులు బ్రదర్ చింతా భాస్కర్ అన్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని గురువారం కోదాడ పట్టణం అనంతగిరి రోడ్డులోని చర్చిలో బుధవారం ప్రత్యేక వేడుకలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు కొత్త దుస్తులు ధరించి చర్చికి చేరుకుని దైవారాధనలో పాలుపంచుకున్నారు. బ్రదర్ భాస్కర్ కేక్ కట్ చేసి పండుగ సందేశాన్ని ఇచ్చారు. క్రీస్తు ప్రేమ సందేశం ప్రపంచమంతా విస్తరించాలని, ఆయన దీవెనలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాత నగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**కోదాడ, విశాలభారతి:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని మాతనగర్ (బీసీఎం కాలనీ)లో ఉన్న కల్వరి వెలుగు ప్రార్థనా మందిరంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలారం గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్, కందిబండ గ్రామ సర్పంచ్ గోపి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రార్థనా మందిరంలో పాస్టర్ సుందర్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రేమ, శాంతి, ఐక్యత సందేశాన్ని క్రీస్తు జన్మ మనకు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ సమాజంలో సౌభ్రాతృత్వం, మానవత్వ విలువలను పెంపొందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో మెలగాలని ఆకాంక్షించారు.వేడుకల్లో క్రైస్తవ సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను ఆనందంగా ముగించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ జక్కుల నరేంద్ర యాదవ్, చంటి, మాజీ కౌన్సిలర్ కోట మధు, బుర్ర వంశీ నాని, మాడుగుల రాహుల్, ప్రవీణ్, నీలి, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## 36 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



**కోదాడ, విశాలభారతి:** కోదాడ మండలం, గుడిబండ గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు ఆదినారాయణ, పీర్ మహమ్మద్, థామస్, జానకిరామ్ రెడ్డి, జాన్ షరీఫ్, సుభాషిణి తదితరులు పాల్గొని తమ విద్యా కాలానికి సంబంధించిన మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు అనంతరం అప్పటి విద్యార్థులు ఇప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వరప్రసాద్‌తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిలు క్రిస్మస్ సంబరాలు



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మండలం మొత్తం క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి, కుటుంబ సమేతంగా తను నమ్ముకున్న దేవుడి చర్చిలకు తరలివచ్చారు. చర్చిలలో విద్యుద్దీప కాంతులతో ధగధగలాడాయి. 'హ్యాపీ క్రిస్మస్' అంటూ ఒకరికొకరు పలకరించుకొని షేక్ హ్యాండ్ చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో ప్రార్థనా మందిరాలు కోలాహలంగా మారాయి. ప్రార్థనల అనంతరం పాస్టర్లు కేక్ కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు బైబిల్‌లోని అంశాలను ఉటంకిస్తూ ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని, ఆయన చాటిన శాంతి, ప్రేమ, కరుణ సందేశాలను వివరించారు. మానవాళి సంక్షేమం కోసం క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని ఉద్బోధించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శాంటాక్లాజ్ (క్రిస్మస్ తాత) వేషధారణలో చిన్నారులు చేసిన అల్లరి, ఏసుక్రీస్తు జీవిత విశేషాలపై వేసిన నాటికలు చూపరులను కట్టిపడేశాయి. పలు చర్చిల వద్ద ఏర్పాటు చేసిన గొర్రెల కాపరుల ప్రదర్శనలు, నక్షత్ర తోరణాలు పండుగ శోభను ద్విగుణీకృతం చేశాయి. గ్రామాల్లో సైతం క్రైస్తవ సోదరులు విందు వినోదాలతో పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ




**నిజామాబాద్, విశాలభారతి:** బోధన రూరల్ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గౌరవ శాసనసభ్యులు ప్రభుత్వ ముఖ్య సలహాదారులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి , సూరే రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, గ్రామ నూతన సర్పంచ్ దాస్ గౌడ్ పాల్గొనడం జరిగింది ఎరాజ్ పల్లి సర్పంచ్ దాస్ గౌడ్ ప్రభుత్వ సలహాదారుడు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి శాలువాతో పూలమాలతో సన్మానించారు.

## క్రైస్తవ కుటుంబాలకు దుప్పట్ల పంపిణీ



**మొయినాబాద్, విశాలభారతి:** చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రిస్మస్ కానుకగా క్రైస్తవ కుటుంబాలకు ఉలన్ దుప్పట్లను కానుకగా ఇచ్చారు. మొయినాబాద్ మున్సిపాలిటి పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గడ్డం వెంకట్రెడ్డి గ్రామంలోని మెథడిస్ట్ చర్చిలో గురువారం దుప్పట్లను పంపిణీ చేశారు.చర్చికి వచ్చే క్రైస్తవ కుటుంబాలతో పాటు ఇతరులకు కూడ దుప్పట్లను పంపిణీ చేశారు. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రైస్తవ కుటుంబాలతో పాటు వృద్ధులకు కూడ సుమారుగా 100 ఉలన్ దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పాస్టర్ విమల్, మెథడిస్ట్ చర్చి కార్యదర్శి టి చంద్రశేఖర్, సంఘం సభ్యులు కే సామయ్య, ఆర్ కిష్టయ్య, కే అంతయ్య, కే ధన్రాజ్, కే శ్రీకాంత్, కే కన్నా, కే శ్రీధర్,వై.రాంచందర్,వై అనీల్ కుమార్, వై.శ్రీధర్,ఎన్ గోపాల్,ఎన్ రవిపాల్,వై బాల్రాజ్,సుధాకర్, చంద్రశేఖర్,నాయకులు కే విక్రంరెడ్డి, యాదగిరిచారి, తదితరులు పాల్గొన్నారు.

# ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేద్దాం

- 27 న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం
- కొల్లోజు శ్రీకాంత్ టీఇఎంజెయు నకిరికల్ నియోజకవర్గం అధ్యక్షులు



**చిట్యాల, విశాలభారతి:** ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీ.ఓ 252 ను సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 వ తేదీన శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉదయం 10.30 గంటలకు తలపెట్టిన తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుయూనియన్ ఆధ్వర్యం లో ధర్నా కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కొల్లోజు శ్రీకాంత్ టీఇఎంజెయు నకిరేకల్ నియోజకవర్గం అధ్యక్షులు కోరారు. అప్పటి లోపు ప్రభుత్వం జీఓను సవరించాలని తాము కోరుకుంటున్నామని, రాజ్యాంగం కల్పించిన హక్కుగా దీర్ఘ కాలిక ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

# పతాకావిష్కరణకు అధిక సంఖ్యలో హాజరు కావాలి



**అశ్వాపురం, విశాల భారతి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎగరవేయు అరుణ పతాక ఆవిష్కరణకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద ప్రజల కోసం సిపిఐ ఎన్నో ఉద్యమాలను చేపట్టిందని, కావున అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**అశ్వాపురం, విశాలభారత :** మండలంలోని చింతిర్యాల గోదావరి రేవు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం రాత్రి చింతిర్యాల క్రాస్ రోడ్ వద్ద సిఐ అశోక్ రెడ్డి పట్టుకొని కేసు నమోదు చేసారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించామని ఆయన తెలిపారు.

# క్రిష్టమస్ వేడుకల్లో పాల్గొన్న దోసపాటి



**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని అణుశక్తి నగర్ గ్రామంలో గల క్రీస్తు మహిమ మందిరంలో గురువారం జరిగిన క్రిష్టమస్ వేడుకల్లో శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవ సోదర, సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వమానవాలికి ప్రేమా, కరుణ, దయ, సేవభావం వంటి మహోత్తర విలువలను, విశ్వశాంతి మార్గములను చూపిన క్రీస్తు వారి భోధనలు సదా ఆచరిణీయం అన్నారు. నమ్మకం ఉన్నచోటే దారి సులువు అవుతుందని, దేవుని సేవలో ఉన్నప్పుడు ప్రజల భవిష్యత్ వెలుగుతుందన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండరు ను ఆవిష్కరించారు. అలాగే నిరుపేదలకు బట్టలను పంపిణి చేసారు. ఆయన వెంట ఫాస్టర్ శేఖర్, రామయ్య ఉన్నారు.

# క్రిస్మస్ సందర్భంగా అన్నదానం



**పాల్వంచ, విశాలభారతి:** జై జీసస్ టీం ఆధ్వర్యంలో క్రిస్మస్ పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ సెంటర్ ఆటో స్టాండ్ వద్ద అన్నదానం(ప్రేమ విందు) నిర్వహించారు. ఈ సందర్భంగా కేటిపియస్ 5,6 దశల చీఫ్ ఇంజినీర్ పాల్గొని కేక్ కటింగ్ చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గం సర్వమానవళికి ఆచరణీయం అని, శాంతి, సహనం, ప్రేమ, ఇతరులపట్ల జాలి, సహాయ గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎం.డేవిడ్, కాల్వ ప్రకాష్, గంగుల నరేందర్ రెడ్డి, సాలీ భాస్కర్, రోహిత్, రాజేందర్, సోమిరెడ్డి, ఆర్.సంజీవ్ కుమార్, మల్లేష్, కుమార్, శివ, అనంత్, సింధు తపస్వీ, వీరు నాయక్, తది తరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**పాల్వంచ, విశాలభారతి:** విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీ లో ఘనంగా క్రిస్మస్ సంబురాలు చేసుకున్నారు ,కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. పాల్వంచ పట్టణం గట్టాయిగూడెం నందు గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా కాలనీవాసులందరూ ఘనంగా క్రిస్మస్ వేడుకలు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను వివరించారు.ఈ కార్యక్రమంలో గుర్రం వెంకటరత్నం,లింగం చంద్ర రావు, సత్యనారాయణ, బంక మనోహర్,గంజి శ్రీను,కాంపాటి ఈశ్వర రావు, గోధుమల కిరణ్ , ఆవుకు ప్రకాష్ కాలనీవాసులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు

- మంత్రి సీతక్క



**ములుగు , విశాలభారతి:** ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క ములుగు క్యాంపు కార్యాలయం నుండి తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి ప్రైస్ ద లార్డ్ అంటూ.. క్రిస్మస్ శాంతి సందేశాన్నిచ్చారు. మంత్రి శీతక్క మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు 2000 సంవత్సరాల క్రితం పాపుల రక్షకుడిగా నరుడి రూపంలో పరలోకమందున్న యెహోవా మరియు నరులకు మధ్య వారధిగా మరియమ్మ గర్భమునందు జన్మించారన్నారు. లోక రక్షకుడిగా జన్మించిన ఆయన తన బాల్య దశ నుండి 33 1/2 సంవత్సరాలు అనగా దాదాపు 34 సంవత్సరాలు(తన చివరి శ్వాస వరకు) ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తూ ప్రేమను పంచారన్నారు. ఆయన బైబిల్ లో ఉన్న 10 ఆజ్ఞలను ప్రచారం చేస్తూ మహోన్నతుడైన యెహోవా నామములో అనేక అద్భుతాలు చేసి,పాపుల రక్షకుడుగా గుర్తింపు పొందిన విషయాన్ని పవిత్ర బైబిల్ గ్రంథం తెలియపరుస్తుందని గుర్తు చేశారు.ఏసుక్రీస్తు, ఆయన జీవనశైలిని మన జీవితాల్లో అనువదించుకొని చెడును విసర్జించి, పాపపు అలవాట్లను పారద్రోలుతూ.శాంతి, ప్రేమ, కరుణ, జాలి, దయను తోటి వారికి పంచినప్పుడే ఐక్యత మరియు ప్రేమ భావంతో మెలగగలమని మంత్రి సీతక్క తన క్రిస్మస్ సందేశంలో పేర్కొన్నారు.మరోసారి తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# శాంతికి చిహ్నం ఏసుప్రభు

- క్రిస్మస్ సందర్భంగా భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

**విశాలభారతి, మర్పల్లి:** ప్రపంచం మొత్తం క్రిస్మస్ శోభ వెలిగిపోతుంది. ప్రపంచం మొత్తం అంతా కలిసి జరుపుకునే ఏకైక పెద్ద పండుగ క్రిస్మస్, ఏసుక్రీస్తు జన్మదినని క్రైస్తవులు పవిత్ర పండుగగా జరుపుకుంటారు. పాపాన్ని తదించి మనసా వాచా కర్మణా పరిశుద్ధ జీవితం కొనసాగించినప్పుడే పరలోక ప్రాప్తి లభిస్తుందని ఏసుక్రీస్తు బోధించారు క్రిస్మస్ పండుగను గురువారం మండలంలోని బుచన్పల్లి, పట్లూర్, కొట్లాపూర్, తుమ్మలపల్లి, నర్సాపూర్, పంచలింగాల్, రావులపల్లి, సిరిపురం మర్పల్లి, తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఆనందస్సహాల మధ్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ కోసం చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. చెడును విడిచి మంచి పంచిన వారి హృదయాల్లో ఆయన ఉంటాడని చెబుతారు.

# ప్రేమ, కరుణే క్రీస్తు సందేశం: మంత్రి ఉత్తమ్



**కోదాడ, విశాలభారతి:** లోక రక్షకుడు యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సిసిఆర్ విద్యా నిలయంలో గురువారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీస్తు చూపిన శాంతి, ప్రేమ మార్గాలు విశ్వవ్యాప్తమని, మానవాళి ఐక్యతకు అవే దిక్సూచి అని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా దృక్పథాన్ని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. క్రైస్తవ విద్యా సంస్థలు సమాజానికి అందిస్తున్న విద్యా సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజలందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ చైర్మన్ ఎర్నేని బాబు సుపీరియర్ సిస్టర్ నక్షత్రం, హెడ్మాస్టర్ ఆన్ జ్యోతి,రోస్ మేరీ, స్టెల్లా శౌరీలు, విజయ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ఘనంగా వాజ్ పై శతజయంతి ఉత్సవాలు



- దేశానికి ఎన్నో సంస్కరణలు తెచ్చిన గొప్ప వ్యక్తి వాజ్పేయి
- కడారి కల్పన బిజెపి పట్టణ అధ్యక్షులు

**చౌటుప్పల్, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల బిజెపి పట్టణ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్పేయి శతజయంతి ఉత్సవాలు బిజెపి పార్టీ కార్యాలయం ఆవరణలో వాజ్పేయి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. తదనంతరం పట్టణ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్ మాట్లాడుతూ అటల్ బిహారి వాజ్పేయి ఎన్నో సంస్కరణలు దేశానికి అందించిన గొప్ప రాజనీతి యోగ్యత చాటిన వ్యక్తి మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్పేయి అని అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగోని శంకరయ్య,చౌటుప్పల మండల కమిటీ ఉపాధ్యక్షులు, పర్నే శ్రీను రెడ్డి,మున్సిపల్ మాజీ ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య యాదవ్,తూర్పునూరి నరసింహ గౌడ్,29వ బూత్ అధ్యక్షులు ఇటికాల దామోదర్ రెడ్డి,30వ బూత్ అధ్యక్షులు బత్తుల మహేష్ గౌడ్,ఎర్రగోని సత్యనారాయణ,వెంకట్ రెడ్డి,బొడ్డు మల్లేశం, యాదయ్య, ముత్తయ్య,కొంతం స్వామి,నన్నూరి కార్తీక్ రెడ్డి,కళ్యాణ్ రెడ్డి,పర్నే శివారెడ్డి,పర్నే భరత్ రెడ్డి,బాతరాజు లింగస్వామి,బి.గణేష్ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం



- హుస్సేన్‌కు ఉత్తమ రాజకీయ నాయకుడు అవార్డు
- వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, సంస్కృతిక శ్యాఖ చైర్మన్
- వెన్నల గద్దర్ గర్ల్ చేతులమీదిగా ప్రదానం

**భద్రాద్రి కొత్తగూడెం, విశాలభారతి:** తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పరిరక్షణకు చేసిన సేవలను గుర్తించి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హుస్సేన్‌కు ఉత్తమ రాజకీయ నాయకుడు అవార్డును ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమం కోసం హుస్సేన్ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో వికలాంగులకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించేందుకు ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు.అవార్డు అందుకున్న హుస్సేన్ మాట్లాడుతూ ,ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా వికలాంగుల హక్కుల సాధనకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ,తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, మెరుగు శివ, ఉమీర్ ఖాన్, సంగీత రెడ్డి, సంతోష్, రమణ, సంపత్ రెడ్డి, సుధాకర్ నాయక్, మధుసూదన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను మార్చిన అగ్నిప్రళయం



- మనువాద కోటలు బద్దలైన రోజు డిసెంబర్ 25
- డాక్టర్ భానుప్రసాద్

**భద్రాచలం, విశాలభారతి:** స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రకుల పేదల స్వయం గౌరవ ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో మను స్మృతి పత్రాల దగ్ధం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అలవాల రాజా పెరియార్ వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రముఖ హేతువాది సామాజిక ఉద్యమ నాయకులు డాక్టర్ భాను ప్రసాద్, పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగిల శివ ప్రశాంత్, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు దామళ సత్యం, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్, బహుజన సంక్షేమ పరిషత్ వ్యవస్థాపకులు ఏవి రావు లు మాట్లాడుతూ 25 డిసెంబర్ 1927 న మహాద్ గడ్డపై విశ్వజ్ఞాని, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'మనుస్మృతి'ని దహనం చేసి, వేల ఏళ్ల బానిసత్వపు సంకెళ్లను తెంచిన రోజు అని,అది కేవలం ఒక పుస్తక దహనం కాదు.. అది అణచివేతపై ప్రకటించిన మహా యుద్ధం అని గుర్తు చేశారు. మనువాదం ఇంకా చావలేదని,మనువాదం రూపం మార్చుకుని రాజ్యాంగంపై దాడి చేస్తోందని అన్నారు. ఆనాడు బాబాసాహెబ్ రాజేసిన ఆ విప్లవాగ్ని నేడు ప్రతి గుండెలోనూ రగులుతోందని, మనువాదు లు మా ఆత్మగౌరవాన్ని తాకాలని చూస్తే ఆ అగ్నిలో భస్మం కాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ స్వయం గౌరవ ఉద్యమ వేదిక నాయకులు పుట్ట రవి, చెన్నం ప్రదీప్, పుల్లారావు, దిలీప్, సత్యనారాయణ, శివ,తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. పెయింటర్ మృతి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-65 రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు అబ్దుల్లాపూర్ మెట్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్ మెట్ మండలం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న నీరుడి యాదగిరి (50), వృత్తి పెయింటర్, గురువారం ఉదయం తన స్కూటీపై గండిచెరువు కల్వరీ చర్చ్ వైపు వెళ్తున్నాడు.ఈ క్రమంలో ఉదయం సుమారు 11 గంటల సమయంలో అబ్దుల్లాపూర్ మెట్‌లోని రామదేవి యూటర్న్ వద్ద ఎన్‌హెచ్-65 రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఎర్టిగా కారు అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపుతూ స్కూటీని ఢీకొట్టిందని ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

# పెద్ద పెద్ద మాల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలి

- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి



**ముషీరాబాద్, విశాలభారతి:** ప్రపంచ స్థాయి గుర్తింపు హైదరాబాద్ కు రావాలంటే పెద్ద పెద్ద మాల్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కోరారు. చారిత్రకమైన నగరానికి మాల్స్ వస్తే నిరుద్యోగ సమస్య ఉండదని పేర్కొన్నారు. గురువారం కూకట్పల్లి వై జంక్షన్ వద్ద లేక్ ఫోర్ మాల్ లో అరవింద్ కుమార్, ప్రశాంత్ మేకల, కాసాని జీవన్ గౌడ్ ఏర్పాటు చేసిన నూతన వాఫిల్ వరల్డ్ షాపును కుందారం గణేశ్ చారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి చారిత్రకమైన మాల్ హైదరాబాద్ కు రావడం చాలా శుభసూచకమన్నారు. దీనితో విద్యార్థులకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ఇంత పెద్ద మాల్ హైదరాబాద్ కు రావడానికి అన్ని విధాలుగా పర్మిషన్స్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మాల్ కు మెట్రో సౌకర్యం ఉండడం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాసాని కృష్ణయ్య, కాసాని గౌతమ్, శాంతకుమారి, శిరీష, స్రవంతి, శ్రీ దీపిక, వలబోజు నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



**కేశంపేట,విశాలభారతి:** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామపంచాయతీ శ్యామ్ రావు తండాకు చెందిన మెగావత్ మారుని గురువారం ఆకస్మికంగా మరణించింది. విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ సఫూరాఆమేర్, వార్డు సభ్యులు చంద్రయ్య, చెన్నయ్య, రమేశ్, రాము, రిజ్వానా బేగం మోహిజ్, మంజుల జంగేష్‌నాయకులు దిద్దెల జంగయ్య, శ్రీశైలం, నందు నాయక్, ముత్యాలు, బద్దూ నాయక్, రామక్రిష్ణ, నసిర్, షాబొద్దిన్, నరేష్, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తుల సంఘం అధ్యక్షుడిగా నందు ముదిరాజ్



**విశాల భారతి,షాద్ నగర్:** అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం. షాద్ నగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా రెబ్బనమోని నందు ముదిరాజ్ ను నియమించినట్లు అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం జాతీయ కార్యవర్గ కమిటీ అధ్యక్షుడు అడ్వకేట్ వాంద్రాసి పెంచలయ్య పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన నందు మాట్లాడుతూ ప్రతి నిత్యం అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని, అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు తనను నియోజకవర్గా అధ్యక్షుడుగా నియమించిన జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాంద్రాసి పెంచలయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అతివేగం ప్రాణం తీసింది



- రోడ్డు ప్రమాదంలో గృహిణి మృతి
- కేసు నమోదు నాగోల్ ఇన్స్పెక్టర్

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా గృహిణి మృతి చెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ విషయాన్ని నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. ఇన్స్పెక్టర్ వివరాల ప్రకారం.. 25122015 నాడు మధ్యాహ్నం గౌరెల్లి లక్ష్మీ నరసింహ స్వామి రియల్ ఎస్టేట్ సమీపంలో స్కూటీపై వెళ్తున్న సపావత్ పద్మ (38)ను గుర్తుతెలియని వ్యక్తి అతివేగంగా నడిపిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు,ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు క్రైం నం. 868/2025 గా బీఎన్ఎస్ సెక్షన్ 106 కింద కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

# ఘనంగా మాజీ ప్రధాని వాజ్పేయి జయంతి




**సికింద్రాబాద్, విశాలభారతి :** మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి జయంతి సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి అటల్ బిహారి వాజ్పేయి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు లతోపాటు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు అటల్ బిహారీ వాజ్పేయి కి ఘన నివాళులు అర్పించడం జరిగింది.

# క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న శివ చరణ్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర అధ్యక్షులు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఎల్.బి నగర్ నియోజకవర్గ పరిధిలోని బాప్టిస్ట్ చర్చిలో క్రిస్టియన్ సోదర సోదరీమణులతో కలిసి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, శాంతి, సోదర భావానికి ప్రతీక అని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, క్రిస్టియన్ సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.





## థియేటర్లలో ఫ్లాప్... ఓటీటీలో హిట్?

థియేటర్లలో ఆశించిన స్థాయిలో సందడి చేయలేకపోయిన కొన్ని సినిమాలు, ఓటీటీ వేదికపై మాత్రం ఊహించని స్థాయిలో ఆదరణ పొందుతుంటాయి. ఇప్పుడు అదే బాటలో నడుస్తున్న సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం తాజాగా ఓటీటీకి వచ్చి మంచి టాక్ తెచ్చుకుంటోంది. మహేష్ బాబు.పి దర్శకత్వంలో, రామ్ – భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించారు. నవంబర్ 27న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు వచ్చినప్పటికీ, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రాకపోవడంతో బాక్సాఫీస్ వద్ద నిరాశ తప్పలేదు. దీంతో నెల తిరగకుండానే సినిమా ఓటీటీ బాట పట్టింది.డిసెంబర్ 25 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా'కి డిజిటల్ ఆడియన్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులో ఉన్న ఈ సినిమా ఓ వీరాభిమాని జీవితాన్ని ఆధారంగా తీసుకుని రూపొందిన కథతో స్మాల్ స్క్రీన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. "థియేటర్లలో మిస్ అయ్యాం కానీ, ఓటీటీలో చూసాక చాలా నచ్చింది", "2025లో వచ్చిన అండర్‌రేటెడ్ సినిమాల్లో ఇది ఒకటి" అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.



## వెన్నులో వణుకు పుట్టించే మిస్టరీ థ్రిల్లర్!

టాలీవుడ్ నటుడు ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం శంబాల. ఈ సినిమాకు యుగంధర్ ముని దర్శకత్వం వహించగా.. అర్చన ఐయ్యర్ కథానాయికగా నటించింది. రవి వర్మ, ఇంద్రనీల్, మీసాల లక్ష్మణ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. మహిధర్, రాజశేఖర్ నిర్మించారు. ఈ సినిమా గురువారం క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



## నాని 'ది ప్యారడైజ్'లో డ్రాగన్ బ్యూటీ

'డ్రాగన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి కాయదు లోహర్ ప్రస్తుతం వరుస అవకాశాలతో బిజీగా మారింది. తక్కువ సమయంలోనే భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, తాజాగా తన కెరీర్‌లోనే అతిపెద్ద ప్రాజెక్ట్‌కు అధికారికంగా ఓకే చెప్పింది. నాని హీరోగా నటిస్తున్న కొత్త తెలుగు సినిమా 'ది ప్యారడైజ్'లో కాయదు లోహర్ కీలక పాత్రలో కనిపించనుంది. కొన్ని రోజులుగా ఈ సినిమా షూటింగ్‌లో ఆమె పాల్గొంటుందనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే వాటిపై ఇప్పటివరకు స్పష్టత లేకపోగా, స్వయంగా కాయదు ఆ వార్తలను కన్ఫార్మ్ చేయడంతో సందేహాలకు తెరపడింది.ది ప్యారడైజ్' గ్లింప్స్ విడుదలైనప్పుడు థియేటర్లలో వచ్చిన రియాక్షన్‌ను చూపిస్తూ కాయదు లోహర్ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను షేర్ చేసింది. అదే వీడియో ద్వారా ఈ సినిమాలో తాను భాగమని అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే ఆమె షూటింగ్ కూడా ప్రారంభించినట్లు సమాచారం. ఈ సినిమా నానికి చాలా కీలకమైన ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతుండగా, భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.